## చిన్నకథ

# కరివేపాకు

\- ఎల్.ఆర్.స్వామి



హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్లు నలుముకుని వాచి వైపు చూశాను. టైం నాలుగున్నర!

కంగారు పుట్టుకొచ్చింది. గబగబ తలగడ వద్ద పెట్టుకున్న సెల్‌ఫోను తీసి చూసాను. హమ్మయ్య! ఇంకా ఫోను రాలేదు. హాయిగా ఊపిరి పీల్చాను.

సూర్యం ఫోనుతోనే నాకు సోమవారాలు తెల్లవారుతాయి!

సెల్ ఫోను అందుకుని మెల్లగా లేచి కిటికి వద్దకు నడిచాను. కిటికి రెక్కలు తీసి తెరకొద్దిగా తొలిగించి చూశాను.

మానవ చైతన్యాన్ని మింగే చల్లటి గాలి నన్ను తాకింది. ఊరంతా చీకటిగా వుంది. అక్కడక్కడ దూరంగా కనబడిన వెలుతురు చుక్కలు, రాత్రి కప్పుకున్న చీకటి కంబళిలోని చిరుగులలా వున్నాయి. తెల్ల మబ్బు నిండిన చుక్కలు లేని ఆకాశం జుట్టు నెరిసిన ముసలి తల్లిలా వుంది. పశ్చిమాన మునిగిన తన బిడ్డ, సూర్యుడు పంపే కిరణ సందేశాల కోసం ఎదురు చూస్తోంది పాపం!

వీధి చివర ఏదో హడావుడి కనబడింది. కొందరు కుర్రవాళ్లు రోడ్డు మీద చలిమంట పెట్టే ప్రయత్నంలో వున్నారు. హఠాత్తుగా గుర్తుకు వచ్చింది, తెల్లవారితే భోగిపండగ అని.

సూర్యం నా మనసులో కదిలాడు. చిన్నప్పుడు భోగిపండుగకి వాడు చేసిన హడావిడి అంతా ఇంతాకాదు. ఎక్కడెక్కడ నుంచో చెత్తాచెదారం చెక్కముక్కలు ఏరి పెరటిలో చేర్చేవాడు. భోగి ముందు రోజు రాత్రి నన్ను అస్సలు నిద్రపోనిచ్చేవాడు కాదు. లేచి భోగి మంట పెట్టమని అర్ధరాత్రినుంచే నిద్రలేపేవాడు. కాని ఇప్పుడు..

విదేశంలో కూర్చుని డాలర్ లెక్కపెట్టుకుంటున్నాడు. డబ్బుల వేటలో పడ్డాక పండుగలూ, బంధుత్వాలూ.. ఉంటాయా?

కళ్లు వొత్తుకున్నాను. వీధి చివర భోగిమంట అంటుకుంది. మనిషిలోని ధనదాహంలా ఎగిరి పడుతోంది మంట. ఆ మంటలేపిన పొగ ఊరిని పూర్తిగ కబళిస్తోంది.

ఫోన్ వైపు చూసాను. ఇంకా కాల్ రాలేదు. ఫోను చెయ్యడా..? చేస్తాడు. ఫోనులో వాడి నెంబర్ వెలుగుతుంది. నెంబర్‌తో పాటు, వాడు, వాడి భార్య నా మనవడు వున్న ఫొటో కనబడుతుంది. వాడు మాట్లాడుతాడు...

''ఎలా వున్నావమ్మా..? బాగున్నావా?''

''ఊ..''

''ఆరోగ్యమెలా వుంది? మందులు వేళకి వేసుకుంటున్నావా..?''

''ఊ..''

''డాక్టర్ ఇంటికి వచ్చి చూస్తున్నారా?''

''ఊ..''

''డబ్బు అందుతోంది కదూ..?''

''ఊ..''

ఫోను పెట్టేస్తాడు. అసలు మాట్లాడను నేను. ఫోనులో ఉన్నంత సేపు వాడి గొంతు వినాలనే తపన నాది. నేనూ మాట్లాడితే., టైం ఎక్కువ అయిందని వాడు ఫోను పెట్టేస్తే.. మరో వారం దాకా వాడి గొంతు వినబడదు కదా..

మరోసారి కళ్లు వొత్తుకున్నాను. నాలుగేళ్ళు దాటాయి, వాడిని చూసి.

మెల్లగా హాలువైపు నడిచి సోఫాలో కూలబడ్డాను. సెల్ టీపాయిమీద పెడుతూండగా చేతికి తగిలింది టీపాయి మీదున్న కరివేపాకు కట్ట. చీకటి పడ్డాక వాచ్‌మేన్ తెచ్చి ఇచ్చాడు ఆ కట్ట. మా అపార్టుమెంటులో కరివేపాకు మొక్కలు ఎక్కువ. పండుగలప్పుడు ఆకులు కోసి పంచుతాడు వాచ్‌మేన్.

కరివేపాకు, సూర్యానికి అసలు పడేదికాదు.

''ఈ ఆకులెందుకమ్మా కూరలో..?'' అంటూ సూర్యం కసిరేవాడు. తిరిగి తనే ''సుఖంగా తిననివ్వక మాటిమాటికి అడ్డు తగులుతూ వుంటాయి'' అనేవాడు.

మరోసారి సెల్‌ఫోను వైపు చూశాను. 'కాల్' ఇంకా రాలేదు.

లేచి టి.వి.ఆన్ చేశాను. సెల్‌లో ఏదో చిన్న సవ్వడి. ఆత్రుతగా సెల్ తీసి చూశాను. 'కాల్' కాదు. ఎస్.ఎం.ఎస్.

'గ్రానీ మమ్మీ, డాడీ, ఓ.కె. ఫోను వద్దు. ఎస్.ఎం.ఎస్. పంపమన్నారు డాడి. ఆర్‌యూ ఓ.కే. వి ఆర్ ఓ.కే.' మనవడి ఎస్.ఎం.ఎస్.

సోఫాలో అలాగే కూలబడ్డాను. కనుకొలకుల్లో రెండు కన్నీటి బిందువులు. టీపాయ్‌మీది కరివేపాకు గాలికి కదులుతోంది.

★

చిరునామా:
ఎల్.ఆర్.స్వామి
హెచ్1 జి 8, సీతమ్మ ధార ఉత్తరం,
విశాఖపట్టణం-530013.
ఫోన్: 9949075859